


ఊరి శివారులో మునసబుగారింటిదగ్గర పుంతలో మా అమ్మ నన్ను కంది. తరువాత యే డేగో తన్నుకుపోతుందని వారింటి పెరట్లో గడ్డిమేటు చాటున గోడలో కూర్చో పెట్టింది. ఆ పెరట్లో ఆడవాళ్ళ బుణగుణధ్వని వినలేకా, వీధి వెంపు ఉంటే కాస్తంత కొత్త మొహాలు కనబడి కాలక్షేపం అవుతుందనీ మెల్లిగా వాకిలివేపు వెళ్లి వీధరుగుల మీద గాదెచాటున బసచేశాను. మునసబుగారు పెద్దవాడై కొడుక్కు పని ఒప్పగించేశాడు. గాదెకి కొంచెం అసింటా పడక్కుర్చీ వేసుకొని పులిలా కూర్చుని కృష్ణా రామా అనుకుంటూ, వాళ్లనూ వీళ్లనూ చివాట్లేస్తూ, పిల్లలకి సలహాలు చెబుతూ, గడించిన ఆస్తిని నిలబెట్టుకునే ఉపాయాలు చేస్తూ వుండేవాడు. ఆయన ఉండడం మానేస్తే బాగుండునని ఆయనకు అప్పుపడ్డవాళ్లు అనుకుంటూ ఉండేవారు. కానీ ఈయన మొండి. వసూళ్ళు పూర్తికాందే పోరాదని తీర్మానించుకున్నాడు. ఆయన కులదీపకుడు గుర్నాధం ఒకనాడు హడావుడిగా యెక్కణ్ణించో ఇంటికొచ్చి 'నాన్నా ఓ అయిదొందలివ్వే నాన్నా అర్జెంటుగా' అన్నాడర్జెంటుగా.

ఏవిటోయ్ ఆ అర్జెంటూ, ఏమిటా దూకుడూ, యెందుకంత డబ్బు? అన్నాడు మునసబుగారు.

ఓ ఫ్రెండుకి అప్పివ్వాలిలే. పాపం. మళ్లీ రేపిచ్చేస్తానన్నాడు. అన్నాడు గుర్నాధం.

అట్టెలట్టె గుర్రాన్ని కట్టెయ్. ఔనుగానీ, నువ్వూ వాడూ పోట్టాడుకున్నారా? అన్నాడు తండ్రి.

మునసబుగారు విట్టీగా మాటాడతారని ఆయన పెళ్లాంబిడ్డలూ, వూళ్లో జనాభా, అప్పులడగ వచ్చేవాళ్లూ అంతా చెప్పుకుంటూనే ఉంటారు. ఆయన మొహంమీదే నిర్మొహమాటంగా అనేస్తారుకూడా.

తండ్రి చమత్కారానికి కొడుకు నవ్వాడు.

బలేవాడివే నాన్నా. పోట్లాడుకుంటే అప్పు కావాలని వాడెలా అడుగుతాడు, నేనెందుకిస్తానూ అన్నాడు.

ఇంకెందుకులా, అందుకే పోట్లాడుకోబట్టే వాడికి నీమీద కోపం వచ్చి అప్పడిగేశాడు. నీకు వాడిమీద తిక్కరేగి ఇస్తానంటున్నావు... అప్పంటూ యిచ్చాక ఇహ కజ్జాలు రావడం ఎంతసేపులా అన్నాడు మునసబుగారు.

పోవేనాన్నా! నువ్వంతా విడ్డూరంగా మాటాడతావు. తొందరగా తాళపుజేతులివ్వు. అతను శివాలయంకాడ కూచున్నాడు. బాగుండదు కష్టపెట్టుకుంటాడు అన్నాడు గుర్నాధం.

కొడుకుమాట పట్టించుకోకుండా. ఓ చుట్ట తీసి వెలిగించేరు మునసబుగారు. అబ్బీ శివాలయం వీధిలో శేషయ్య గార్నెరుగుదువుగదా అన్నాడు.

ఆ! ఎరక్కేం, వెధవ. మహా దుర్మార్గుడు, రాక్షసుడు.

★ ★ ★